సాక్షి
రంగారెడ్డి
గురువారం, 13, మార్చి, 2025






**భగీరథ.. నీటివృథా!**

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు రంధ్రం పడి తాగునీరు వృథాగాపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.
8లో▸



**విద్యకు ప్రాధాన్యమివ్వాలి**

బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు.
8లో▸




## న్యూస్‌రీల్

### నేడు డయల్ యువర్ డీఎం

**షాద్‌నగర్‌రూరల్:** బస్సు ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226287 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు, ప్రయాణికులు సమస్యలు, సూచనలు, సలహాలను అందజేయాలని కోరారు.

### 'పల్లె'కు నేతల పరామర్శ



రవికుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**హుడాకాంప్లెక్స్:** బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌ను బుధవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో ప్రమాదవశాత్తు జారి పడడంతో కాలికి తీవ్రగాయమైంది. దీంతో ఆయన్ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి రవికుమార్‌ను ఆయన నివాసంలో పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన్ను పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కాచం సత్యనారాయణ, కాచం సుష్మ, హైదరాబాద్ జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ సుశీలరెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్ల శివశంకర్ నేత, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు ఆడాల రమేష్, కొండల్‌రెడ్డి, మాధవరం నర్సింహరావు తదితరులు ఉన్నారు.

### ఇంటి నుంచే సదరం స్లాట్స్

- దివ్యాంగులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు
- డీఆర్‌డీఓ శ్రీలత

**ఇబ్రహీంపట్నం రూరల్:** దివ్యాంగులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) జారీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల జారీకి గతంలో ఏడు రకాల వికలత్వాలకు మాత్రమే అవకాశం ఉండేదని.. ప్రస్తుత ప్రభుత్వం మరో 14 వికలత్వాలను కలిపి మొత్తం 21 రకాలను చేసిందన్నారు. గతంలో సదరం స్లాట్స్ బుకింగ్ మీసేవలో మాత్రమే వెసులుబాటు ఉండేదన్నారు. యూడీఐడీ ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే ఇంటినుంచే స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని వివరించారు. రంగారెడ్డి జిల్లాలో వనస్థలిపురం ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రిని యూడీఐడీకి కేటాయించడం జరిగిందన్నారు. జిల్లా వాసులు ఆయా ఆస్పత్రుల్లో మాత్రమే తమ దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. యూడీఐడీ కార్డులు స్పీడ్ పోస్టులో నేరుగా ఇంటికే వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సంధ్యారాణి, డీపీఎం విజయశ్రీ, ఏపీఎం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఓయూలో ఉమెన్స్ డే వేడుకలు




మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బుధవారం జరిగిన మహిళా దినోత్సవంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీలో ప్రమోటింగ్ ఉమెన్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, ఫాస్టరింగ్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, వీసీ ప్రొ.కుమార్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్ రెడ్డి, యూజీసీ డీన్ ప్రొ.లావణ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాగా.. ఓయూ ఆర్ట్స్ కాలేజీ కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్కకు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు వర్సిటీ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు.

# గురుకులం.. నవ్యాక్షర పథం

## ఏకీకృత గురుకులాలకు నిధుల మంజూరు

- ఒక్కోటి 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- అక్కడే వసతి గృహాల సముదాయాలు
- జిల్లాలో షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఏర్పాటు



షాద్‌నగర్ పరిధిలోని కొందుర్గు ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మించే స్థలం

**షాద్‌నగర్:** కులం లేదు.. మతం లేదు.. బీద, ధనిక భేదం లేదు.. చదువులమ్మ చెట్టు నీడలో అందరూ ఒకేచోట అక్షరాలు దిద్దొచ్చు.. సర్కారు అందించే సాయంతో బంగారు భవితకు బాటలు వేసుకోవచ్చు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సమీకృత ఏకీకృత పాఠశాలలతో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలా చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లు వెచ్చించి అత్యాధునిక సదుపాయాలతో అక్షర కేంద్రాలకు శ్రీకారం చుడుతోంది. జిల్లాలో షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు మంజూరు చేసింది.

### ఆరంభం ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా మారిన విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా.. నిరుపేదలకు అక్షరాన్ని అందుబాటులోకి తేచ్చేలా ప్రభుత్వం ఏకీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి అంకురార్పణ చేస్తోంది. షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో గత ఏడాది అక్టోబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఈ పాఠశాలలను అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామని, గ్రామీణ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేలా ఈ బడులను తీర్చిదిద్దుతామని సీఎం బహిరంగ సభలో ప్రకటించారు.

### ఇదీ ప్రయోజనం..

ఇప్పటికే గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చదువుతో పాటు ఆసక్తి కలిగిన రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా కులాలు, మతాల వారీగా పాఠశాలలు, వసతి గృహాలు ఉన్న నేపథ్యంలో అందరినీ ఒకే గొడుగు కిందకు తేనున్నారు. కార్పొరేట్ స్థాయిలో ఈ గురుకులాల్లో కంప్యూటర్లు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఆయా రంగాల్లో వారికి శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులను అందుబాటులో ఉంచనున్నారు.

### ఇంటిగ్రేటెడ్‌లో ఇవీ ప్రత్యేకతలు..

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రతి నియోజకవర్గంలో నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలను సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. విద్యార్థులకు తరగతి గదులే కాకుండా అంతర్జాతీయ స్కూళ్లతో సమానంగా క్యాంపస్‌లను అధునాతనంగా నిర్మించనున్నారు. విద్యార్థులకు ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించనున్నారు. అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించనున్నారు. సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు ఐదు వందల మంది ఉపాధ్యాయులు బోధన చేయనున్నారు. పాఠశాల భవనాన్ని అంతర్జాతీయ పాఠశాలలతో సమానంగా నిర్మించనున్నారు. సౌర, వాయు విద్యుత్‌ను వినియోగించేలా, వాన నీటిని సంరక్షించేలా డిజైన్ చేశారు. విద్యార్థులకు క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

### హర్షనీయం



ఏకీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేయడం హర్షనీయం. ఉన్నత విద్య కోసం పిల్లలను దూర ప్రాంతాలకు పంపించాల్సిన అవసరం తగ్గుతుంది. అత్యాధునిక వసతులతో నిర్మించే గురుకులాలు పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది.

– సుజాత, విశ్వనాథ్‌పూర్, కొందుర్గు మండలం

### పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య



విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రపంచంతో పోటీ పడే విధంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం కోసం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా తీర్చిదిద్దనుంది.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

# ఉపాధి పనుల్లో వేగం పెంచండి

- వంద శాతం పన్నులు వసూలు చేయాలి
- జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

**యాచారం:** ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పర్యటనలో భాగంగా ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్యతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీ ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. వేసవి నేపథ్యంలో కూలీలు పని చేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరం, జెడ్పీ అతిథి గృహాన్ని పరిశీలించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్చి 25 వరకు 24 పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలుకు కృషి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఉదయమే పనులు చేసుకోవాలి**

**కందుకూరు:** ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి కూలీలకు సూచించారు. బుధవారం కందుకూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మీర్‌ఖాన్‌పేట పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించి కూలీలతో మాట్లాడారు. ఉదయమే త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని కోరారు. కొలతల ప్రకారం పనులు చేసి రూ.300 చొప్పున కూలీ పొందాలన్నారు. పని ప్రదేశంలో తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలో కొనసాగుతున్న నర్సరీని పరిశీలించారు. అంకురోత్పత్తి రాని బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు లేదంటే నారు నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సరిత, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, ఏపీఓ రవీందర్‌రెడ్డి, టీఏలు గోపాల్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: మీర్‌ఖాన్‌పేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

# దైవ ఉద్యమానికి సహకరించండి

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరిన రంగరాజన్

**మొయినాబాద్:** దైవానికి రాజ్యాంగ బద్ధమైన అధికారాల కోసం చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి జరుగుతున్న ఉద్యమానికి సహకరించాలని అర్చకుడు రంగరాజన్.. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని వెంకయ్యనాయుడు నివాసంలో ఆయనను కలిసి విన్నవించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. దేశంలో రామరాజ్య పునఃస్థాపన రాజ్యాంగబద్ధంగా జరగాలని.. సుప్రీం కోర్టుకు తన పరిధి గురించి తెలిపేవిధంగా పిటిషన్స్ కమిటీ రఘురామకృష్ణకు సమర్పించిన లేఖ గురించి వెంకయ్యనాయుడుకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని రంగరాజన్ తెలిపారు.



వెంకయ్యనాయుడుతో అర్చకుడు రంగరాజన్

# వడివడిగా అడుగులు..

- కొంగర కుర్దులో ఏఐ సిటీ..
- తిమ్మాయిపల్లిలో ఐటీ పార్కు
- 625 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- టెక్నికల్ బిడ్‌లకు ఆహ్వానం
- ఫోర్త్‌సిటీ అభివృద్ధి పనులు చకచకా

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌సీడీఏ)ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు భూ సేకరణ ప్రక్రియ మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా 625 ఎకరాలను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. వేర్వేరు చోట్ల గుర్తించిన భూముల్లో ఒకచోట ఏఐ సిటీని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. మరో చోట ఇతర ఐటీ కంపెనీల హబ్‌గా తీర్చేదిద్దేలా ప్రతిపాదనలు తయారు చేసింది. ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్న పట్టణాభివృద్ధి సంస్థ.. ఫార్మా, ఐటీ, లైఫ్ సైన్సెస్, స్పోర్ట్స్ హబ్ లకు స్థలాలను నిర్దేశించింది. ఇటీవల నాగిరెడ్డి పల్లిలో భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం తాజాగా మహేశ్వరం, కందుకూరు మండలాల్లోనూ మరికొంత భూమిని సమీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూ సేకరణ చేస్తున్న సర్కారు.. ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూ సేకరణ చేపడుతోంది. భూ లభ్యతపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం.. అసైన్డ్ భూముల వివరాలను సేకరిస్తోంది.

**ఐటీ, పారిశ్రామిక పార్కుల కోసం..**

మహేశ్వరం మండలం రావిర్యాల పరిధిలోని కొంగరకుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 275.12 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూముల్లో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు అందులో పేర్కొంది. అయితే.. ప్రతిపాదిత భూములను ఏఐ సిటీకి కేటాయించనున్నట్లు తెలిసింది. 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సిటీని అభివృద్ధి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిపాదిత రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సమీపంలోని అసైన్డ్ భూములను సేకరించి.. ఏఐ సిటీకి కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అలాగే.. కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 350.22 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం కూడా చెల్లించనున్నట్లు పేర్కొంది.

**రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లు**

మీర్‌ఖాన్‌పేట వద్ద యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులను మేఘా సంస్థకు అప్పగించింది. పనులు చకచకా సాగుతున్నాయి. మరో వైపు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్ పేట మీదుగా ఆర్ఆర్ఆర్ వరకు 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేపట్టింది. దారి పొడవునా.. రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లను పాతే పనిలో నిమగ్నమైంది. మొదటి దశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.2 కిలోమీటర్లకు రూ.1,665 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా మీర్‌ఖాన్‌పేట నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 22.30 కిలోమీటర్లకు రూ.2365 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఆ మేరకు టెక్నికల్ బిడ్‌లను ఆహ్వానించింది.

# ఫ్యూచర్ అథారిటీలో చోటు కల్పించాలి



యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు



కందుకూరు: నేదునూరు గేట్ వద్ద గ్రామస్తుల ధర్నా

### ఎమ్మెల్యేకు మూడు రెవెన్యూ గ్రామాల వినతి

**యాచారం:** ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, సుల్తాన్‌పూర్ రెవెన్యూ గ్రామాలను కలిపేందుకు కృషి చేయాలని మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం మంతన్‌గౌరెల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొర్ర అరవింద్ నాయక్ ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని 20 రెవెన్యూ గ్రామాలకు గాను 17 రెవెన్యూ గ్రామాలను యూడీఏలోకి తీసుకుని మిగిలిన మూడు రెవెన్యూ గ్రామాలను వదిలేశారని తెలిపారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్ రెవెన్యూ గ్రామాలను సైతం యూడీఏలోకి తీసుకునేలా కృషి చేయాలని కోరారు. యూడీఏలోకి తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయమై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు దెంది రాంరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, నాయకులు లిక్కి రాజారెడ్డి, కారింగ్ యాదయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

**నేదునూరు గ్రామస్తుల ధర్నా**

**కందుకూరు:** ఫ్యూచర్ సిటీ అథారిటీలోకి తమ గ్రామాన్ని సైతం చేర్చాలని నేదునూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా శ్రీశైలం హైవేపై నేదునూరు గేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఫ్యూచర్ సిటీ అథారిటీలోకి మేజర్ గ్రామ పంచాయతీ నేదునూరును విస్మరించడం బాధాకరమన్నారు. శ్రీశైలం రహదారికి కేవలం రెండున్నర కిలోమీటర్ల దూరంలోనే తమ గ్రామం ఉందన్నారు. ఆ రహదారికి వంద మీటర్ల దూరం నుంచే తమ రెవెన్యూ పరిధి ప్రారంభమవుతుందన్నారు. తమ గ్రామంపై వివక్ష చూపడం సరికాదన్నారు. అథారిటీలో కలిపే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.బాలరాజ్, మాజీ ఉప సర్పంచ్‌లు బి.శ్రీనివాస్, జి.ప్రభాకర్‌రెడ్డి, యు.సాయిలు, వివిధ పార్టీల నాయకులు ఐ.రాకేష్‌గౌడ్, ఎస్.అమరేందర్ రెడ్డి, ఎ.కుమార్, ఎస్.వెంకటేష్, పి.సురేందర్‌రెడ్డి, బి.సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణనాయక్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

# 'డబుల్' ఇళ్లను కేటాయించాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్

**మొయినాబాద్:** అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వాలనే డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం ఎదురు చూస్తున్నా ప్రభుత్వాలు పేదల గోడును పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిర్మాణం పూర్తయినా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రభుదాస్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, గోపాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్**


విలేకర్లతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

**చేవెళ్ల:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇచ్చి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్లలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మరిచిపోయిందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 90 శాతం మంది విద్యార్థులు పేద, మధ్య తరగతికి చెందినవారే ఉన్నారన్నారు. వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలలో అధిక ఫీజుల వసూళ్ల నియంత్రణపై చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో దాదాపు 83 మంది విద్యార్థులు మృతి చెందారని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవటం బాధాకరమన్నారు. గురుకులాలలో ప్రవేశపెట్టిన కామన్ మెనూ అటకెక్కిందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు ప్రేమ్, శివ, సంధ్య, పూజిత తదితరులు ఉన్నారు.

## మహా నగరగంలో మరిన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు

**ఖాజాగూడ, ట్రిపుల్ ఐటీ జంక్షన్ల వద్ద..**

- రెండు రహదారుల విస్తరణ సైతం..
- రూ.650 కోట్లతో టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ
- ట్రాఫిక్ సమస్య పరిష్కారమే ప్రధాన లక్ష్యం

# హై.. హై సిటీ!






**సాక్షి, సిటీబ్యూరో:**

హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల్లో భాగంగా రెండు జంక్షన్ల వద్ద నాలుగు ఫ్లై ఓవర్లు.. రెండు అండర్‌పాస్‌లు.. రెండు రహదారుల విస్తరణ, అభివృద్ధి పనుల కోసం జీహెచ్‌ఎంసీ జాతీయ స్థాయి టెండర్లను పిలిచింది. ఈ పనుల నిర్మాణ వ్యయం దాదాపు రూ. 650 కోట్లు. టెండర్ల దాఖలుకు చివరి తేదీ వచ్చే నెల 9. గ్రేటర్ నగరంలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం ఇప్పటికే ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర వసతులు అందుబాటులోకి వచ్చాయి. పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మరిన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు సిద్ధమైన ప్రభుత్వం దాదాపు రూ.2,400 కోట్ల మేర పనులు చేపట్టాల్సిందిగా ఇటీవల జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. అందుకనుగుణంగా ఇప్పటికే కేబీఆర్ పార్కు పరిసరాల్లో కొన్ని స్టీల్ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఫాక్స్ సాగర్ నాలా వద్ద ఫ్లై ఓవర్ పనులకు టెండర్లు ఆహ్వానించిన జీహెచ్‌ఎంసీ.. తాజాగా ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్‌ల వద్ద మరికొన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లకు టెండర్లు ఆహ్వానించింది. వీటితో పాటు సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్ రోడ్ వరకు 150 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు ఆహ్వానించింది. జీహెచ్‌ఎంసీ నుంచి కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ నిధులు చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ పనుల్ని రెండేళ్లలో పూర్తి చేయాల్సిందిగా టెండరు నిబంధనల్లో పేర్కొంది. పనులు పూర్తయ్యాక మరో రెండేళ్లపాటు అవసరాన్ని బట్టి మరమ్మతులు వంటివి చేయాల్సి ఉంటుంది.

### తాజాగా టెండర్లు పిలిచిన పనులు

**ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద..**

- ఐఎస్‌బీ నుంచి డీఎల్‌ఎఫ్ రోడ్ వరకు రెండు వైపులా ప్రయాణానికి మొదటి వరుస ఫ్లై ఓవర్. నాలుగు లేన్లు. క్యారేజ్ వే వెడల్పు 7.5 మీటర్లు.
- ఐఎస్‌బీ నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు రెండో వరుసలో మరో ఫ్లై ఓవర్. మూడు లేన్లుగా ప్రయాణం. క్యారేజ్‌వే వెడల్పు 11 మీటర్లు.
- డీఎల్‌ఎఫ్ నుంచి బీహెచ్‌ఈఎల్ రోడ్ వైపు వెళ్లేందుకు రెండో వరుసలో మూడు లేన్ల ఫ్లై ఓవర్. క్యారేజ్‌వే వెడల్పు 11 మీటర్లు.
- గచ్చిబౌలి నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు రెండు వైపులా ప్రయాణానికి ఆరు లేన్లతో అండర్‌పాస్. 11 మీటర్ల క్యారేజ్‌వే. వరద నీరు పోయే మార్గాలతో పాటు 2 లక్షల నీటి సామర్థ్యంతో సంప్ నిర్మాణం.

**ఖాజాగూడ జంక్షన్ వద్ద..**

- నానక్‌రామ్‌గూడ – టోలిచౌకి రోడ్ వరకు మూడు లేన్లతో ఫ్లై ఓవర్. క్యారేజ్‌వే 9.5 మీటర్లు.
- టోలిచౌకి రోడ్– బయోడైవర్సిటీ వరకు మూడు లేన్లతో అండర్‌పాస్. క్యారేజ్‌వే 11 మీటర్లు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లతో పాటు వాటి కింద డక్ట్ నిర్మాణం. వరదనీరు పోయే మార్గాలతోపాటు 2 లక్షల నీటి సామర్థ్యంతో సంప్ నిర్మాణం.
- ఈ పనులతో పాటు ఆయా జంక్షన్ల వద్ద రోడ్ల పునరుద్ధరణ, ఫుట్‌పాత్‌లు, లైటింగ్, ఇతరత్రా సదుపాయాలతో ఆధునికీకరణ. సైబరాబాద్ సీపీ కార్యాలయం – గచ్చిబౌలి జంక్షన్ వరకు, అంజయ్యనగర్ –రాంకీ టవర్ రోడ్ వరకు రోడ్లను వెడల్పు చేసి సాఫీగా ప్రయాణం సాగేలా ఆధునికీకరించాలి.

### ఇదివరకే టెండర్లు పిలిచిన పనులు

**ప్యాకేజీ – 1 కింద రూ. 580 కోట్ల అంచనా వ్యయంతో..**

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ వరకు మొదటి వరుస ఫ్లై ఓవర్.
- యూసుఫ్‌గూడ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు రెండో వరుస ఫ్లై ఓవర్.
- కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్ జంక్షన్ వద్ద జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి క్యాన్సర్ హాస్పిటల్ రోడ్ వరకు అండర్‌పాస్.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు ఫ్లై ఓవర్.
- ముగ్ధ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రన్స్ రోడ్ నుంచి పంజగుట్ట రోడ్ వరకు అండర్‌పాస్.

**ప్యాకేజీ–2 కింద .. రూ. 510 కోట్ల అంచనా వ్యయంతో..**

- రోడ్ నంబర్–45 జంక్షన్ వద్ద ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు ఫ్లై ఓవర్.
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ వద్ద మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 జంక్షన్ వరకు అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు ఫ్లై ఓవర్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ వద్ద కేన్సర్ హాస్పిటల్ రోడ్ నుంచి ఫిల్మ్‌నగర్ రోడ్ వరకు అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 వరకు ఫ్లై ఓవర్.
- కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు అండర్‌పాస్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచిబ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 వరకు ఫ్లై ఓవర్.

ఆయా ఫ్లై ఓవర్ల నిర్మాణాలు పూర్తయితే కోర్ సిటీలోని వివిధ ప్రాంతాల నుంచి పశ్చిమం వైపు.. ఐటీ కారిడార్లకు రాకపోకలు చేసేవారికి సమయం, వ్యయ ప్రయాసలు తప్పుతాయని అధికారులు పేర్కొన్నారు.



## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**యాచారం:** నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన అమీర్‌పేట శ్రీశైలం(55) వారం రోజుల కింద తన వ్యవసాయ పొలం నుంచి బైక్‌పై ఇంటికొస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా చౌదర్‌పల్లి గేట్ కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీశైలంను పోలీసులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.



## చికెన్ సెంటర్‌లో గంజాయి

**2.5 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**


నిందితుడు మహబూబ్

**మొయినాబాద్:** చికెన్ సెంటర్‌లో గంజాయి విక్రయం కలకలం రేపింది. పోలీసుల తనిఖీలో 2.5 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి తీసుకొచ్చిన వ్యక్తి పరారు కాగా విక్రయించే యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహబూబ్ అనే యువకుడు అజీజ్‌నగర్‌లో ఓ గదిలో అద్దెకు ఉంటూ అదే ప్రాంతంలోని ఏజీఆర్ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. చికెన్ సెంటర్‌లో పనిచేస్తూనే అదనపు సంపాదన కోసం తాను అద్దెకు ఉండే గదిలో గంజాయి విక్రయిస్తున్నాడు. కాగా బుధవారం నగరంలోని ధూల్‌పేట్ నుంచి ఓ వ్యక్తి రూ.20 వేలు విలువ చేసే 2.5 కిలోల గంజాయి తీసుకొచ్చి చికెన్ సెంటర్‌లో మహబూబ్‌కు విక్రయించాడు. ముందుగానే పసిగట్టిన పోలీసులు చికెన్ సెంటర్ వద్దకు రాగానే గంజాయి తీసుకొచ్చిన వ్యక్తి పారిపోయాడు. పోలీసులు చికెన్ సెంటర్‌లో తనిఖీ చేయగా 2.5 కిలోల గంజాయి లభించింది. అక్కడే ఉన్న మహబూబ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ధూల్‌పేట్ నుంచి తెచ్చే గంజాయిని తాను గదిలో పెట్టి అవసరమైనవారికి విక్రయిస్తానని అంగీకరించాడు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**యాచారం:** అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కడ్తాల్ మండలం ఎక్వాయ్‌పల్లి గ్రామానికి చెందిన ఎదుల నర్సింహ మండల పరిధిలోని పలు గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫాంల్లో పనిచేసే కార్మికులకు అధిక ధరకు అమ్ముకుంటాడు. అదే మాదిరిగా గ్రామాల్లో సేకరించిన బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున వాహనంలో 30 ప్లాస్టిక్ బ్యాగుల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. చింతపట్ల గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ వాహనాన్ని పోలీసులు నిలిపి చూడగా అందులో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ తోడ్పాటు భేష్

**సాక్షి, సిటీబ్యూరో:** కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముకలాంటిదని, సేవాదళ్ సేవలు ప్రశంసనీయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యనిర్వాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు అయూబ్‌ఖాన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సేవాదళ్ తెలంగాణలో విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సేవాదళ్ కీలక పాత్ర పోషించిదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తిస్తుందన్నారు. సేవాదళ్ కమిటీలను జిల్లాల వారీగా నియమిస్తున్నామని వెల్లడించారు. ఇటీవల పార్టీ భర్తీ చేస్తున్న పలు పదవులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. సేవాదళ్ కర్తవ్యం కాంగ్రెస్ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకోవడమన్నారు. జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు సేవాదళ్ జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ని అవమానిస్తూ చేస్తున్న కుట్రలను సేవాదళ్ కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

## నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

**సిటీకోర్టులు:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ కేసుల విచారణకు ఆయన వ్యక్తిగతంగా హాజరయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు రాజాసింగ్‌తోపాటు పలువురు సాక్షులను రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ ఆధ్వర్యంలో ఎగ్జామిన్ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారని ఆయనపై కేసులు నమోదైన సంగతి విదితమే.

## 15 రోజులు..4 చోరీలు

- కరడుగట్టిన దొంగ శంకర్‌నాయక్ అరెస్టు
- ఇప్పటికే వందకుపైగా దొంగతనాలు.. పలుమార్లు జైలుకు సైతం..


మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి

**లాలాపేట:** బీఫార్మసీ పూర్తి చేసినా..జల్సాల కోసం చోరీలకు తెగబడుతున్న కరడుగట్టిన దొంగ శంకర్ నాయక్‌ను మరోసారి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అతన్ని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. అనంతరం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి తదితరులు మాట్లాడుతూ శంకర్ నాయక్ దొంగతనాల చిట్టా విప్పారు. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలపై అందిన పలువురి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా విశ్వసనీయ సమాచారంతో శంకర్ నాయక్‌తో పాటు మరో దొంగను ఎల్బీనగర్‌లో అరెస్ట్ చేసి రూ.9 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే వందకు పైగా దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి..ఈ మధ్యనే బెయిల్‌పై బయటకు వచ్చిన శంకర్‌నాయక్..15 రోజుల వ్యవధిలోనే 4 చోరీలకు పాల్పడినట్లు పోలీసులు వివరించారు. ఓయూ పీఎస్‌తో పాటు పటాన్‌చెరు, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. శంకర్‌నాయక్ నుంచి 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దొంగిలించిన వస్తువుల వివరాలను పేపర్‌పై రాసి గోడకు అతికించడంతో పాటు..ఏ ఇంట్లో ఎలా..ఏమేం చోరీ చేశాడో కూడా శంకర్ నాయక్ తన డైరీలో రాసుకుంటాడని పోలీసులు వివరించారు.

## టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీని రద్దు చేయాలి

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** టీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీని వెంటనే రద్దు చేయాలని సీనియర్ జర్నలిస్టులు రఘుపతి, గణేశ్ రాష్ట్ర కమిటీకి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే జిల్లా సమావేశాలు ఏకపక్షంగా కొనసాగాయని విమర్శించారు.

# ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

**బషీరాబాద్:** ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నవీన్(28) హైదరాబాద్‌లోని ఓ సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. ఈయన తల్లిదండ్రులు చనిపోవడంతో పినతల్లి అంజిలమ్మతో కలిసి ఉండేవాడు. వారం క్రితం ఇంటికి వచ్చిన యువకుడు మరునాడు ఉదయం గది తలుపులు తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి తలుపులు తెరచి చూడగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే బలవన్మరణానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భగీరథ.. నీటివృథా!

**చేవెళ్ల:** మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు రంధ్రం పడి తాగునీరు వృథాగాపోవడంతో పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపల్లి సమీపంలో బుధవారం కేబుల్ వైర్ల కోసం జేసీబీతో కాల్వ తీస్తుండగా భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు తగిలింది. దీంతో పైప్‌లైన్ ధ్వంసమై నీళ్లు ఎగిసిపడ్డాయి. రహదారి మొత్తాన్ని ఆక్రమించి వెదజిమ్మిన నీటితో ఈ రూట్‌లో రాకపోకలు సాగించిన ద్విచక్ర వాహనదారులు తడిసి ముద్దయ్యారు. నీటి వృథాతో ఈప్రాంతమంతా బురదమయమైంది. కొద్దిసేపటి తర్వాత మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందడంతో సరఫరాను నిలిపేశారు.


పైపులైన్ లీకేజీతో రోడ్డుపైన వాహనాలపై పడుతున్న నీరు


ఇబ్రహీంపల్లి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి వృథాగా పోతున్న నీరు

## చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలి మృతి

**కొత్తూరు:** రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న జ్యోతి(40) స్థానికంగా ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ఈ నెల 11న మధ్యాహ్నం పని నిమిత్తం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిని కాలినడకన దాటే క్రమంలో మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవ్వడంతో పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందారు. ఈ సంఘటనపై పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయిన వ్యక్తి


మల్లయ్య (ఫైల్)

**మాడ్గుల:** ఇంట్లో గొడవ పడి ఓ వ్యక్తి ఎటో వెళ్లిపోయిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన బన్నె మల్లయ్య మంగళవారం ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు అతని భార్య అనురాధ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హోలీ సందర్భంగా సిటీలో ఆంక్షలు

**సాక్షి, సిటీబ్యూరో:** హోలీ నేపథ్యంలో నగరంలో ఆంక్షలు విధిస్తూ నగర సీపీ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 6 నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ఇవి అమలులో ఉంటాయి. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు మీద వెళ్లేవారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాగే రోడ్లపై గుంపులుగా తిరగ వద్దని స్పష్టంచేశారు. వీటిని అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## హెబ్రోను చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్ కన్నుమూత

**చిక్కడపల్లి:** గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్(82) బుధవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ముషీరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందారు. గాంధీనగర్‌లో నివసించే పీటర్‌కు భార్య రాజేశ్వరి, కుమారుడు ఇమ్మాన్యుయెల్, కుమార్తె ఎస్తేరు ఉన్నారు.